నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

# యాదాద్రి భువనగిరి

ఆదివారం 29 అక్టోబర్ 2023
SUNDAY, OCTOBER 29, 2023
YADADRI BHUVANAGIRI
పేజీలు : 12
PAGES



ఆలేరులో సీఎం కేసీఆర్ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత బూడిద భిక్షమయ్య గౌడ్



# నేడు ఆలేరుకు సీఎం కేసీఆర్

ఇండోర్ స్టేడియంలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరు

2లో..

స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం.. అందుకు తగ్గట్టే పూర్తి ఏర్పాట్లు

70వేల మందికిపైగా వస్తారని అంచనా

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ సునీతా మహేందర్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రి భువనగిరి జిల్లాకు ఆదివారం రానున్నారు. ఆలేరు పట్టణంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో 30 ఎకరాల్లో బహిరంగ సభ ఏర్పాట్లు చేశారు. ఆలేరు నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి చేపట్టడంతోపాటు గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను చూసేందుకు, ఏం చెప్తారో వినేందుకు తరలి వచ్చేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సిద్ధమవుతున్నారు. 70వేలకు పైగా వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. శనివారం సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ పరిశీలించారు. బీఆర్ఎస్ బాస్ సభతో ఆలేరు పట్టణం జెండాలు, కటౌట్లతో గులాబీమయమైంది.

*– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)*

# ఆలేరు.. అభివృద్ధి జోరు

స్వరాష్ట్రంలో మారిన ఆలేరు నియోజకవర్గం రూపురేఖలు

కరువు నేలను సస్యశ్యామలం చేస్తున్న కాళేశ్వరం జలాలు

- ఆధ్యాత్మిక ప్రపంచం అబ్బురపడేలా యాదగిరిగుట్ట ప్రధానాలయం పునర్నిర్మాణం
- మిషన్ కాకతీయతో 579 చెరువులకు పూర్వ వైభవం
- ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ జలాలు
- కొత్త మున్సిపాలిటీలు.. గ్రామపంచాయతీల ఏర్పాటుతో చేరువైన పాలన
- యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజ్.. తుర్కపల్లికి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు

5లో..

నాడు కన్నీటి వెతలు.. నేడు ప్రగతి పరుగులు



యాదగిరిగుట్ట ప్రధానాలయం

ఒకప్పుడు ఆలేరు ప్రాంతం అంటే కన్నీళ్లు.. కష్టాల బోత. ఎటుచూసినా చుక్కనీరు లేక బీడుబారిన నేలలు. తాగునీటి కోసం గోస తీసిన ప్రజలు. 65 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అత్యంత వెనుకబాటుకు గురైన నియోజకవర్గం. అలాంటి ఆలేరు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు పాలనలో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. కేవలం తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ సంకల్పం, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కృషితో ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కలలోనైనా ఊహించని కాళేశ్వరం జలాలు ఇక్కడి బీడు భూములను తడుపుతున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుజ్జీవం పోసుకుని పల్లెలకు, పంటలకు ప్రాణం పోస్తున్నాయి. ఆలేరు, యాదగిరిగుట్ట కొత్త మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. చెక్‌డ్యామ్‌లు, వంతెనలు, తళతళ మెరిసే రోడ్లు, రైతు వేదికలు.. పల్లె ప్రకృతి వనాలు.. ఇలా అభివృద్ధికి అనేక చిరునామాలుగా కనిపిస్తున్నాయి. నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు చేరువయ్యాయి. రూ.1,300 కోట్లతో పునర్నిర్మితమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం ఆధ్యాత్మిక ప్రపంచానికే ఐకాన్‌గా దర్శనమిస్తున్నది. యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ, తుర్కపల్లికి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ మంజూరయ్యాయి. మొత్తంగా రూ.5,500 కోట్లతో అన్ని రంగాల్లో ఆలేరు నియోజకవర్గం పురోగతి సాధించింది.

*– యాదగిరిగుట్ట, అక్టోబర్ 28*



భూదాన్ పోచంపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

## సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష

భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి భూదాన్ పోచంపల్లిలో ఎన్నికల ప్రచారం

3

# కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి ముసలం

మునుగోడు నియోజకవర్గంలో దిష్టిబొమ్మల దహనం

రాజగోపాల్‌రెడ్డి దుర్మార్గుడు.. బుద్ధి చెప్తామని ఆగ్రహం

పరాయిగడ్డ నుంచి వచ్చి ఇక్కడ పెత్తనమేంటంటూ

చలమల కృష్ణారెడ్డి వర్గీయుల భేటీ

కచ్చితంగా మునుగోడు బరిలో ఉంటా : చలమల.

ఉదయపూర్ డిక్లరేషన్ అంటూ బీసీలకు మొండిచెయ్యి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క టికెట్‌తోనే సరిపెట్టిన కాంగ్రెస్

## రాజగోపాల్‌రెడ్డికి టికెట్‌పై ఫైర్



సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో రాజగోపాల్‌రెడ్డి ఫొటో దహనం చేస్తున్న కృష్ణారెడ్డి వర్గీయులు

6లో..

అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రెండో జాబితా నల్లగొండ జిల్లాలోని ఆ పార్టీలో ముసలం పుట్టిస్తున్నది. కష్టకాలంలో పార్టీ అంటిపెట్టుకుని కాపాడుకున్న నేతలకు కాదని మధ్యలోనే పార్టీని వదిలేసి... సచ్చిపోయిన పార్టీ కాంగ్రెస్ అంటూ దుర్భాషలాడిన నేతలు మళ్లీ వస్తే టికెట్ ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తమవుతున్నది. రెండో జాబితా రాగానే మునుగోడు నియోజకవర్గంలో పలుచోట్ల రాజగోపాల్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేసి తమ ఆగ్రహాన్ని వెల్లగక్కాయి. కోమటిరెడ్డి బ్రదర్స్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండలో కాంగ్రెస్ పార్టీకి వైరస్‌లా తయారయ్యారని దుయ్యబట్టాయి. తాను మునుగోడు బరిలో నిలవడం ఖాయమని, పరాయిగడ్డ నుంచి వచ్చిన రాజగోపాల్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని చలమల్ల కృష్ణారెడ్డి ప్రకటించారు. దేవరకొండలోనూ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌కు టికెట్ కేటాయించడం పట్ల కిషన్‌నాయక్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తన అనుచరులతో భేటీ అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిసింది. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ఒక్కో లోక్‌సభ స్థానంలో రెండేసి అసెంబ్లీ టికెట్లు బీసీలకు కేటాయిస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు ప్రకటించి, ఉమ్మడి జిల్లాలో ఒక్కసీటుతోనే సరిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*– నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)*